
ధర్మవరం అర్బన్ : మెయిన్‌బజార్‌లో కొలువుదీరిన భారీ వినాయకుడు


ఓడీచెరువులో పూజలందుకున్న గణపయ్య


బత్తలపల్లి: ధర్మవరం రోడ్డులో ఏర్పాటు చేసిన గణపతి


బత్తలపల్లిలో అన్నదానం చేస్తున్న భక్తులు


పుట్టపర్తి ఎస్పీ కార్యాలయంలో పూజలు నిర్వహిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు దంపతులు


పుట్టపర్తి టౌన్ : పెద్దబజార్‌లో ఆంజనేయుడి రూపంలో గణపతి

విఘ్నేశ్వరా పాహిమాం!

సాక్షి నెట్‌వర్క్: ధర్మవరం, కదిరి, పుట్టపర్తి, రాప్తాడు నియోజకవర్గాల్లో వినాయక చవితి వేడుకలు సంబరంగా జరిగాయి. గణేష్ ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో వాడవాడలా వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసి పెద్ద ఎత్తున పూజలు చేపట్టారు. మండపాల వద్ద సాంస్కృతి కార్యక్రమాలతో అలరించారు. మండపాల వద్ద పెద్ద ఎత్తున అన్నదానం చేపట్టారు. భక్తులు స్వాములను దర్శించుకుని పూజలు నిర్వహించారు. అలాగే ప్రముఖ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొన్నిచోట్ల శనివారమే వినాయక నిమజ్జనం చేపట్టారు. మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు చేపట్టారు.


నల్లమాడ ఎస్సీ కాలనీలో కొలువుదీరిన లంబోదరుడు


నల్లచెరువు: బస్టాండ్ సర్కిల్ వద్ద వెంకటేశ్వరుడి అలంకరణలో గణనాథుడు


చెన్నేకొత్తపల్లిలో పూజలందుకున్న భారీ బొజ్జ గణపయ్య


కదిరి టౌన్ : ఎర్రకోటలో కొలువుదీరిన వినాయకుడు


నల్లమాడ వైఎస్సార్ సర్కిల్ వద్ద సింహ వాహనంపై బొజ్జగణపయ్య


ముదిగుబ్బలో పూజలందుకున్న భారీ విఘ్నేశ్వరుడు


కనగానపల్లి: మామిళ్లపల్లి బీసీ కాలనీలో కొలువుదీరిన వినాయకుడు


గాండ్లపెంటలో వినాయకుడికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు


ధర్మవరం అర్బన్ : గుట్టకిందపల్లిలో నెమలి, వీణపై కొలువుదీరిన గణపయ్య


ధర్మవరం అర్బన్ : రామ్‌నగర్‌లో అయోధ్య మందిరంపై వినాయకుడు


ఓడీచెరువు శివాలయం వద్ద భక్తులకు అన్నదానం చేస్తున్న నిర్వాహకులు


పుట్టపర్తి టౌన్ : కుమ్మరిపేటలో నటరాజ్ అవతారంలో వినాయకుడు


తనకల్లులో పూజలందుకుంటున్న గణనాథుడు


ధర్మవరం అర్బన్: జగ్జీవన్‌రామ్‌నగర్‌లో గదపై గణపతి


తలుపుల: మాడికవాండ్లపల్లిలో కొలువైన వినాయకుడు


తనకల్లు పీర్లచావిడి వద్ద కోలాటం ఏర్పాటు చేసిన నిర్వాహకులు


బత్తలపల్లి: రామాపురం వద్ద చిత్రావతిలో గణపతిని నిమజ్జనం చేస్తున్న ఓ కుటుంబం


బత్తలపల్లి ఎస్సీకాలనీలో పూజలందుకున్న పార్వతీతనయుడు


కదిరి టౌన్: రాజేంద్ర ప్రసాద్‌వీధిలో కొలువుదీరిన గణపయ్య


కదిరి టౌన్ : వెదురుతో తయారుచేసిన వినాయకుడు

క్లుప్తంగా

ఆకట్టుకున్న తోలు బొమ్మలాట


తోలు బొమ్మలాట ప్రదర్శన

తాడిమర్రి: మండల కేంద్రంలో ఈడిగ కులస్తులు ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన తోలు బొమ్మలాట ఆకట్టుకుంది. ధర్మవరం మండలం నిమ్మలకుంట నుంచి తోలు బొమ్మలాట కళాకారులు రామాయణంలోని పలు కీలక ఘట్టాలను కళ్లకు కట్టేలా ప్రదర్శించారు. అలాగే బంగారక్క, పిల్లేబిత్రుల చిత్రాలతో సాగిన హాస్య సన్నివేశాలు ఆహుతులు కడుపుబ్బ నవ్వించాయి. అర్ధరాత్రి దాటేదాకా సాగిన ఈ ప్రదర్శనను తిలకించడానికి ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చి తిలకించారు. నిర్వాహకులను పలువురు అభినందించారు.

మద్యం విక్రేత అరెస్ట్


నిందితుడు, మద్యాన్ని చూపుతున్న టూటౌన్ సీఐ రెడ్డప్ప

ధర్మవరం అర్బన్: అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. స్థానిక టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం వివరాలు వెల్లడించారు. పట్టణంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న నరసింహులును అరెస్టు చేసి 48 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు.

వినాయకా మా మొర ఆలకించు..


పుట్టపర్తిలో వినాయకు విగ్రహం ముందు నిరసన తెలుపుతున్న కార్మికులు

పుట్టపర్తి టౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని 18 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.. నీవైనా మా మొర ఆలకించూ వినాయకా అంటూ సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు వినాయకుడిని వేడుకున్నారు. ఆదివారం పట్టణంలో ఎనుములపల్లి గణేష్ కూడలిలోఉన్న వినాయకునికి సాష్టాంగ నమస్కారం చేసి వినతి పత్రం అందజేశారు. ఒంటికాలిపై నిలబడి నిరసన తెలిపారు. సీఐటీయూ నాయకులు వెంకటేష్, లక్ష్మీనారాయణ, సత్యసాయి వాటర్ కార్మికులు మధు, ప్రభు, సోము, శివప్రసాద్, కేశవ, వేణు, తిమ్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బత్తలపల్లి: సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారం 18 వ రోజుకు చేరింది. మండల కేంద్రంలోని సత్యసాయి వాటర్ ట్యాంకు వద్ద మండలంలో పని చేస్తున్న సత్యసాయి కార్మికులు నిరసన కార్యక్రమం చేపట్టారు. పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి జిల్లా ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి జగన్ మారుతి, శంకరయ్య, బాషా, షేక్ మహబూబ్‌బాషా, అనంతయ్య, మురుగేష్, రామ్మోహన, జయరాము, సద్గురు, నరసింహులు, కేశవ, సిద్దయ్య తదితరులు పాల్గొన్నారు.

తాడిమర్రి: ప్రజల దాహార్తిని తీర్చడానికి అహర్నిశలూ శ్రమిస్తున్న తమ జీవితాలతో ప్రభుత్వం ఆటలాడుతోందని సత్యసాయి తాగునీటి పథకం సరఫరా కార్మికులు వాపోయారు. ఆదివారం స్థానిక మద్దుల చెర్వు సమీపంలోని సత్యసాయి తాగునీటి సంపు వద్ద ఆదివారం సమ్మె కొనసాగించారు. కార్యక్రమంలో కార్మికులు సతీష్, కే.పెద్దఓబిలేసు, పీ.తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

నల్లమాడ: బకాయి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సత్యసాయి తాగునీటి పథకం కార్మికులు ఆదివారం 18వ రోజు కొత్తపల్లి తండా పంప్ హౌస్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. వేళ్లమద్ది గ్రామ పంచాయితీ వైఎస్సార్ సీపీ సర్పంచ్ బొజ్జేనాయక్ కార్మికులకు మద్దతు తెలిపారు. కార్మికులు నాగభూషణ, రామాంజనేయులు, శంకర తదితరులు పాల్గొన్నారు.

మిత్రుని కుటుంబానికి ఆర్థిక చేయూత


ఆర్థికసాయం అందిస్తున్న మిత్రులు

తనకల్లు: అనారోగ్యంతో మృతి చెందిన మిత్రుని కుటుంబాన్ని అతడి స్నేహితులు ఆర్థికంగా చేయూతనిచ్చారు. బత్తినవారిపల్లికి చెందిన మనోహర్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. మనోహర్‌తో కలిసి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ (1991–93 బ్యాచ్) వరకు కలసి చదువుకున్న మిత్రులు అతని కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలనుకున్నారు. అందరి సహాయ సహకారాలతో రూ.1.44 లక్షలు సేకరించారు. ఆ మొత్తాన్ని ఆదివారం తమ స్నేహితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో తవళం వేణుగోపాల్, జరిపిటి వేణుగోపాల్, భాస్కర్‌రెడ్డి, ఆనంద్, మురళీధర్ యాదవ్, జిలాన్ సిన్హా, గంగన్న, లెక్చరర్ శంకర్, ఖాదర్‌బాషా, రెడ్డెప్ప, నారాయణప్ప, రఘునాథరెడ్డి, రఫీ, లాయర్ లక్ష్మీకాంత్, షాహీర్, రవీంద్రారెడ్డి, శ్రీనివాసులు, గంగాధర్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

కల్పలతారెడ్డి నియామకం హర్షణీయం

కదిరి అర్బన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమాచార హక్కు చట్టం రాష్ట్ర అధ్యక్షురాలిగా ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి నియామకం హర్షణీయమని వైఎస్సార్‌టీఏ రాష్ట్ర నాయకులు గంగాధర్‌రెడ్డి, ఆంజనేయులునాయక్, వెంకట్రామిరెడ్డి, శంకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు వారు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు.

కంటి వైద్య శిబిరం

ధర్మవరం అర్బన్: ఉచిత కంటి వైద్య శిబిరంతో పేదలకు కంటిచూపును అందిస్తున్నామని రోటరీ క్లబ్ అధ్యక్షుడు జయసింహ, ఉపాధ్యక్షుడు నరేంద్రరెడ్డి, కోశాధికారి సుదర్శన్‌గుప్తలు తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 124 మంది పరీక్షలు చేయించుకోగా 90 మంది కంటి ఆపరేషన్లకు ఎంపికయ్యారు. క్యాంపు దాతలతోపాటు వైద్యులను రోటరీక్లబ్ సభ్యులు సన్మానించారు.సాంస్కృతిక మండలి వ్యవస్థాపకులు సత్రసాల ప్రసన్నకుమార్, రోటరీక్లబ్ సభ్యులు రామకృష్ణ, శివయ్య, కొండయ్య, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

దుద్దుకుంట నివాసంలో వినాయక చవితి వేడుకలు


వినాయక పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే దుద్దకుంట శ్రీధర్‌రెడ్డి, కుటుంబ సభ్యులు

నల్లమాడ: పుట్టపర్తి మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి తన స్వగ్రామం నల్లసింగయ్యగారిపల్లిలోని తన నివాసంలో శనివారం వినాయక చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కుటుంబ సభ్యులతో కలసి ఆయన గ్రామంలో కొలువుదీర్చిన వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు, సిరి సంపదలతో నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషంగా ఉండేలా దీవించాలని వినాయకుడిని వేడుకున్నట్లు శ్రీధర్‌రెడ్డి తెలిపారు. శ్రీధర్‌రెడ్డి సతీమణి దుద్దుకుంట అపర్ణారెడ్డి, కుమారుడు కిషన్‌రెడ్డి, సోదరుడు, వైఎస్సార్ సీపీ నేత దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి, రాజేశ్వరమ్మ పూజల్లో పాల్గొన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

తలుపుల: గోడ పడగొట్టిన ఘటనలో ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. మండల కేంద్రంలో యూనియన్ బ్యాంకు ఎదురుగా గల వీధికి చిన్నమహబూబ్‌బాషా ఇటీవల ఇంటి వద్ద గోడ నిర్మించాడు. ఈ గోడను అదే వీధికి చెందిన మురళి, వెంకటప్ప, శంకరరెడ్డి పడగొట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

కదిరి టౌన్: కుమ్మరవాండ్లపల్లికి చెందిన తలుపుల శ్రీనివాసనాయుడు అలియాస్ సీబీఎస్ నాయుడుపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేశారు. టీడీపీ ముఖ్య నేతలపై శ్రీనివాసనాయుడు అసభ్యంగా పోస్టులు పెట్టడంపై టీడీపీ బీసీ సెల్ పట్టణాధ్యక్షుడు నాగప్ప పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ నారాయణ రెడ్డి తెలిపారు.

బియ్యం సేకరణ

చెన్నేకొత్తపల్లి: విజయవాడ వరద బాధితులకు చందమూరు గ్రామానికి చెందిన యువకులు ఆదివారం ఇంటింటా బియ్యం సేకరించారు. ఇప్పటి వరకు 11 ప్యాకెట్ల బియ్యం సేకరించినట్లు వెల్లడించారు. ఇంకా చుట్టు పక్కల గ్రామాల్లో బియ్యం సేకరించి వరద బాధితులకు అందిస్తామని తెలిపారు.

చికిత్స పొందుతూ కూలీ మృతి

నల్లమాడ: రోడ్డు ప్రమాదంలో గాయపడిన కూలీ చికిత్స పొందుతూ మృతిచెందాడు. వివరాలు..ఈనెల 1న తనకల్లు మండలం నారేవాండ్లపల్లి వద్ద బొలేరో వాహనం సిమెంట్ లారీని ఢీకొన్న ప్రమాదంలో బొలేరోలో ప్రయాణిస్తున్న నల్లమాడ మండలం గూడమేకలపల్లికి చెందిన శంకర్ అనే కూలీ మృతిచెందగా మరో 20 మందికిపైగా కూలీలు గాయపడిన విషయం తెలిసిందే. ఇదే ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దొన్నికోటకు చెందిన కూలీ ఇడగుట్టు గంగాద్రి (49) కర్నూలు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆదివారం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

గుండెపోటుతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని మృతి

నల్లమాడ: కొత్తబత్తలపల్లికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ఎస్. ఝాన్సీ(26) గుండెపోటుతో శనివారం మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపారు. భర్త మదన్‌మోహన్‌రెడ్డితో కలిసి ఝాన్సీ లండన్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నట్లు సమాచారం, వీరికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. భర్త లండన్‌లోనే ఉండగా పిల్లలతో కలిసి ఆమె కొద్ది రోజుల క్రితం ఇండియాకు వచ్చింది. తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు తల్లి, అత్త, ఇతర కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లింది. శనివారం క్యూలో స్వామి దర్శనానికి వెళ్తుండగా గుండెపోటుతో మృతి చెందింది.